# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలని వినతి



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 15:** కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యవర్గం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్‌ను కోరింది.ఈ మేరకు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్,సీనియర్ జర్నలిస్ట్ అంజిబాబు,కార్యవర్గ సభ్యులు ఆకెళ్ల శ్రీనివాస్,గుండు శ్రీను తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిత్యం వార్తా సేకరణలో నిమగ్నమై ఉండే జర్నలిస్టులకు తక్కువ వేతనాలే అందుతున్నందున,వారి పిల్లల విద్యాభారం తగ్గించేలా ఫీజు రాయితీ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో కూడా జిల్లాలోని కలెక్టర్లు జర్నలిస్టుల పిల్లలకు ఇటువంటి సౌకర్యాన్ని కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.వారి వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్,బాబ్జి,సతీష్,నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా




# ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యవర్గ సమావేశం



**కాజులూరు, పెన్ పవర్,జూన్ 15:** కాజులూరు మండలం గొల్లపాలెంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యవర్గ సమావేశం సంఘ అధ్యక్షులు దేవు సదానందమూర్తి అధ్యక్షతన ఉత్సాహంగా జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్షులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి సమావేశ విశేషాలను సభ్యులకు వివరించారు. అలాగే ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ టాక్స్) రిటర్నులు దాఖలు చేయాల్సిన విధానం, సంఘటిత శక్తి యొక్క ఆవశ్యకత,పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.సమావేశంలో సీనియర్ ఉపాధ్యాయులు మేడిశెట్టి శ్రీరాములు,ప్రధాన కార్యదర్శి డి. చిన్నారావు,కోశాధికారి ఆర్.వి. రామరాజు,కనకారావు,వెలగా ధనలక్ష్మి, పి.వి.ఆర్. ప్రమోద్‌కుమారి తదితరులు పెన్షనర్ల సమస్యలు, సంక్షేమ అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.ఈ సందర్భంగా సంఘ పత్రిక చందాల సేకరణకు పిలుపునివ్వగా,వి.ధనలక్ష్మి మరియు పి.వి.ఆర్. ప్రమోద్‌కుమారి తలా రూ.1,500 చొప్పున జీవిత చందాలుగా చెల్లించారు.అలాగే ఆర్.వి. రామరాజు రూ.400, కోట సత్యనారాయణ రూ.400 చొప్పున పత్రిక చందాలు అందజేశారు.చివరగా కార్యదర్శి ఎస్.వి. రావు వందన సమర్పణ చేయగా సమావేశం ముగిసింది.





01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుంది

## జిల్లా ఎస్పీ బిందు మాధవ్



**కాకినాడ, బ్యూరో(తుని) పెన్ పవర్, జూన్, 15:** తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సిహెచ్ అగ్రహారంలో చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ అయిన ప్రదేశాన్ని సోమవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పరిశీలించారు చిన్నారి తల్లిదండ్రులు సుంకర గణేష్ భవాని దంపతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు చిన్నారి వెళ్లిన ప్రదేశాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ బిందు మాధవ్ మాట్లాడుతూ తుని రూరల్ పోలీసులు చిన్నారి మిస్ అయిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని తెలిపారు ఎన్ డి ఆర్ ఎఫ్ ఎం డి ఆర్ ఎఫ్ అటవీశాఖకు చెందిన హనుమాన్ దళాలు క్విక్ రియాక్షన్ టీమ్స్ స్పెషల్ పోలీసులు నిరంతరం గాలిస్తూనే ఉన్నారన్నారు అన్ని కోణాలలో పరిశీలిస్తున్నామని లభించిన ఆధారాలు ప్రకారం కిడ్నాప్ జరిగి ఉండకపోవచ్చన్నారు చిన్నారి ఆచూకీ లభించే వరకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందన్నారు



# అన్నవరం కల్యాణకట్టలో 'కృత్రిమ' లూటీ..!

**భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని సాగుతున్న దోపిడీ?**

**అన్నవరం కల్యాణకట్టలో 'కృత్రిమ' లూటీ.. భక్తుల మొక్కుబడులపై అవినీతి నీడ!**

**అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తుల మొక్కుబడుల పేరుతో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కేశఖండన శాలలో అధికారికంగా రూ.40 టికెట్ కొనుగోలు చేసిన తర్వాత కూడా అదనంగా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. రికార్డుల్లో ఉన్న సిబ్బంది సంఖ్య, క్షేత్రస్థాయిలో విధుల్లో కనిపిస్తున్న సిబ్బంది సంఖ్య మధ్య భారీ వ్యత్యాసం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి వెనుక ఉన్న అసలు కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.**

**కాకినాడ బ్యూరో (పెన్ పవర్) అన్నవరం, జూన్ 15:** ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. స్వామివారి దర్శనంతో పాటు మొక్కుబడులు తీర్చుకునే భాగంగా అనేక మంది తలనీలాలు సమర్పిస్తుంటారు. అయితే భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాన్ని ఆధారంగా చేసుకుని కల్యాణకట్టలో జరుగుతున్న అక్రమ వసూళ్లు ప్రస్తుతం తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నాయి.

దేవస్థానం నిబంధనల ప్రకారం భక్తులు కేశఖండన కోసం అధికారిక కౌంటర్ వద్ద రూ.40 చెల్లించి టికెట్ కొనుగోలు చేయాలి. కానీ టికెట్ కొనుగోలు చేసిన తర్వాత కూడా కల్యాణకట్టలో కొందరు సిబ్బంది అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.100 లేదా అంతకంటే ఎక్కువ మొత్తం ఇస్తేనే సక్రమంగా సేవ అందిస్తున్నారని, లేదంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు భక్తుల నుంచి వస్తున్నాయి.భక్తుల కథనాల ప్రకారం కొందరు సిబ్బంది డబ్బులు ఇవ్వని వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారని, పవిత్ర క్షేత్రానికి వచ్చే భక్తుల పట్ల కనీస గౌరవం కూడా పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. మొక్కుబడి తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు అవమానకర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంలో మరో కీలక అంశం సిబ్బంది హాజరు. అధికారిక రికార్డుల ప్రకారం విధుల్లో ఉండాల్సిన నాయి బ్రాహ్మణుల సంఖ్య ఒకలా ఉండగా, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారి సంఖ్య మరోలా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న రోజుల్లో కూడా తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని చెబుతున్నారు.దీంతో ఉద్దేశపూర్వకంగానే సిబ్బంది కొరత సృష్టించి, భక్తులపై ఒత్తిడి పెంచి అదనపు వసూళ్లకు అవకాశం కల్పిస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాగితాలపై పూర్తి సిబ్బందిని చూపిస్తూ, వాస్తవానికి కొద్దిమందితోనే నిర్వహణ సాగుతోందా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఇంత జరుగుతున్నా పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్న భక్తుల నుంచి వినిపిస్తోంది. హాజరు పట్టికలు, డ్యూటీ రిజిస్టర్లు, బయోమెట్రిక్ నమోదు వివరాలు క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నారా? అక్రమ వసూళ్లపై ఎప్పుడైనా ప్రత్యేక విచారణ చేపట్టారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. క్తుల అభిప్రాయం ప్రకారం ఈ వ్యవహారంపై దేవస్థానం కార్యనిర్వాహక అధికారి నల్లం సూర్యచక్రధర్ రావు స్వయంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బయోమెట్రిక్ హాజరు వివరాలు, డ్యూటీ రిజిస్టర్లు, సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీసే ఇటువంటి ఆరోపణలను తేలికగా తీసుకోరాదని, భక్తులకు పారదర్శకమైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, సిబ్బంది పూర్తిస్థాయిలో విధుల్లో ఉండేలా చర్యలు చేపడితేనే భక్తుల విశ్వాసం నిలబెట్టుకోగలమని అభిప్రాయపడుతున్నారు.

# శ్రీ ఆదిత్య యూనివర్సిటీలో ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు



**గండేపల్లి, పెన్ పవర్, జూన్ 15:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "అభివృద్ధి చెందిన ప్రోటోటైపింగ్ మరియు ఆటోమేషన్‌లో ప్రాయోగిక శిక్షణ -- కాన్సెప్ట్ నుండి ఇంటెలిజెంట్ ప్రొడక్ట్ అనే అంశంపై ఐదు రోజుల అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈనెల 15 నుండి 19 వరకు నిర్వహిస్తారని, యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలియజేసారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదుకు చెందిన ఐజెన్ ల్యాబ్స్ వ్యవస్థాపకులు మరియు సీఈఓ డా. కె. ఆదర్శ్ హాజరై, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.

ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్స్ డా. ఎ. రమేష్, డా. ఎస్. రామా శ్రీ, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, డీన్స్ డాక్టర్ ఎ.శరవణన్ ,డాక్టర్ పీ .ఎస్ .రంజిత్ ,మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. ఎస్.డి.వి.వి.ఎస్. భీమేశ్వర్ రెడ్డి, డిప్యూటీ హెచ్. ఓ. డి. ఎ.ఎస్. ఎస్. ఎం .సీతారామమూర్తి కోఆర్డినేటర్స్ డాక్టర్ ఉజ్వాల్ కిరణ్,ఎస్ .గణపతి, పి.జయకిషన్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# శంఖవరం తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన వైసిపి నాయకులు...



**శంఖవరం పెన్ పవర్ జూన్ 15:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు శంఖవరం మండలం వైసిపి అధ్యక్షులు నరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు శంఖవరం మండల తహసిల్దార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుండి ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అంతా పారదర్శకంగా జరిగేలా చూడాలని, ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని తహసిల్దార్‌కు కోరడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, నిబంధనల ప్రకారం ప్రక్రియ సాగాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అడపా సోమేశ్ (కత్తిపూడి గ్రామ వైసిపి అధ్యక్షులు), చొప్పా రాంబాబు (ఎంపీటీసీ), చల్లా సత్య ప్రసాద్ (ఎంపీటీసీ), భరత్ మరియు మండల పరిధిలోని పలువురు వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు...

**మండల అభివృద్ధి అధికారిని కలిసిన శంకవరం అభివృద్ధి కమిటీ సభ్యులు...**



**శంఖవరం పెన్ పవర్ జూన్ 15:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో శంఖవరం గ్రామం నందు జరుగుతున్న పూజ బాపూ గ్రామీణ రోజ్ యోజన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా పెదబాపన్న దోర చెరువులో, జట్లావారి చెరువులో పూడితీత పనులు జరుగుతున్నాయి. సదరు పూడిక తీత పనులలో సీనియార్ మేట్, యితర మేట్ ద్వారా కొన్ని అక్రమాలు జరుగుచున్నవి

సదరు విషయమై శంఖవరం గ్రామ సీనియర్ మేటుకు, శంఖవరం మండలం జేఈ శ్రీనివాసరావు ఫోన్ ద్వారా విషయాలు తెలియజేసిన కానీ సదర అక్రమాలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి.అవి ఉపాధిహామీ పథకం నందు ఉదయం ఫోటో తీయించుకుని అనంతరం కొంతమంది శ్రామీకులతో ప్రైవేటు వ్యవసాయ క్షేత్రాల్లోకి వ్యవసాయ పనులను కొనసాగించుచున్నారు. అలా ప్రైవేటు వ్యవసాయ క్షేతం పని చేసే సమయంలో గతంలో ఒక శ్రామికుడిని పాము కుట్టడం వల్ల ప్రమాద పరిస్థితి ఏర్పడింది. కొంతమంది పెత్తందారులు కావాలనే వారి ప్రైవేటు వ్యవసాయ క్షేత్రాల్లో ఉపాధి శ్రామికులచే పనులు చేయించుకొనుచున్నారు. అదే విధంగా కొంతమందిపై రాజకీయపార్టీ ముద్ర వేసి ఉపాధిహామీ పనిని కల్పించడం లేదు. ఈ విషయమై జేఈ శ్రీనివాసరావు పలుమార్లు ఫిర్యాదు చేసిన యధాతధంగా పరిస్థితులు కొనసాగుతున్నాయి.

కావున కావున సదరు అక్రమాలపై తమరు శాఖపరమైన దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసు కోవాల్సిందిగా

శంఖవరం గ్రామం ఉపాధి హామీ పథకంలో జరుగుతున్నటువంటి అవినీతిపై శంకవరం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ ఫిర్యాదును పురస్కరించుకుని శంఖవరం ఎంపీడీవో దీనిపై తగు దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటానని తగు హామీ ఇవ్వడం జరిగింది.

# గండేపల్లిలో మట్టి మాఫియా దందా!

**రాత్రి, పగలు తేడా లేకుండా చెరువులు, కుంటలు, కాలువల నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న మట్టి మాఫియా గండేపల్లి మండలంలో రెచ్చిపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా? లేక రాజకీయ అండదండలా? అనే ప్రశ్నలు స్థానిక ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సూరంపాలెం పాపమ్మ చెరువు నుంచి కే.నాయకపల్లి వరకు అనధికార మట్టి తవ్వకాలు కొనసాగుతున్నప్పటికీ అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ కాకినాడ / గండేపల్లి జూన్ 15 :** "తవ్వేకొద్దీ డబ్బు మూటలు" అన్న సామెతను అక్షరాలా నిజం చేస్తూ గండేపల్లి మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా చెరువులు, కుంటలు, కాలువలను లక్ష్యంగా చేసుకుని భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జాతీయ రహదారి–16 పరిధి నుంచి ఏడీపీ రోడ్డు వరకు విస్తరించిన గండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సూరంపాలెం గ్రామ పరిధిలోని పాపమ్మ చెరువు నుంచి భారీ వాహనాల ద్వారా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. అలాగే మండలంలోని కే.నాయకపల్లి గ్రామ పరిధిలోని రెండు చెరువుల్లో కూడా పట్టపగలే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చెరువుల నుంచి మట్టిని భారీ లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం? :** చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తరలించాలంటే సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. రాయల్టీ, ఇతర ఫీజుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. అయితే ఎలాంటి అనుమతులు లేకుండానే తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆయకట్టుకు ముప్పు :** చెరువుల క్రింద వందల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నప్పటికీ మట్టి మాఫియా మాత్రం వాటిని పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికంగా మట్టి తవ్వడం వల్ల చెరువుల సహజ స్వరూపం దెబ్బతిని భవిష్యత్తులో సాగునీటి నిల్వ సామర్థ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

**ధ్వంసమవుతున్న రహదారులు :** భారీ లారీలు, ట్రాక్టర్లు నిరంతరం రాకపోకలు సాగించడం వల్ల గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లు కొద్ది కాలంలోనే పాడైపోతున్నాయని పేర్కొంటున్నారు.

**అధికారుల పాత్రపై ప్రశ్నలు :** ఇంత పెద్ద ఎత్తున మట్టి అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు ప్రజాప్రతినిధుల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతోందా? లేక అధికారుల నిర్లక్ష్యమే కారణమా? అనే చర్చ మండల వ్యాప్తంగా సాగుతోంది.

**అనుమతులు లేవంటున్న ఇరిగేషన్ శాఖ :** ఈ విషయమై ఇరిగేషన్ శాఖ జేఈ శ్రీనివాసును సంప్రదించగా, మండల పరిధిలోని చెరువులు, కాలువలు లేదా ఇతర ప్రాంతాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు జారీ కాలేదని స్పష్టం చేశారు. విషయం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే పరిశీలించి అక్రమ తవ్వకాలను నిలిపివేసే చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతూ, ప్రజా సంపదను దోచుకుంటున్న మట్టి మాఫియాపై అధికారులు ఎంత వేగంగా స్పందిస్తారో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి






**కలెక్టర్ హరేందిర ప్రసాద్**


**కాకినాడ, పెన్ పవర్,జూన్ 15:** ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి నాణ్యతతో కూడిన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు,సీపీవో పీ. త్రినాథ్, డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులు హాజరయ్యారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి బియ్యం కార్డుల మంజూరు, కార్డుల్లో పేర్ల మార్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణల తొలగింపు, డ్రైన్లు, కాలువల పూడిక తొలగింపు, పారిశుధ్యం తదితర అంశాలపై మొత్తం 347 అర్జీలు అందాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీని సకాలంలో, నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచేలా అధికారులు పనిచేయాలని,వివిధ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అంతకుముందు అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతి, ఇతర పరిపాలనా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

**రెవెన్యూ క్లినిక్‌కు 49 అర్జీలు**

రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం కూడా ఇదే వేదికలో జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.రీ–సర్వే, భూముల వివరాల ఆన్‌లైన్ నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏ భూములు, సర్వే నంబర్లకు సంబంధించిన సమస్యలు తదితర రెవెన్యూ అంశాలపై మొత్తం 49 అర్జీలు అందినట్లు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి డా. తిప్పేనాయక్ రెవెన్యూ డివిజనల్ అధికారులు,తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించి రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన అర్జీలను సకాలంలో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమాల్లో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవం విజయవంతానికి కాజులూరులో యోగా ట్రైనర్లకు శిక్షణ

**కాజులూరు, పెన్ పవర్,జూన్ 15:** "యోగా ఫర్ హెల్తీ ఏజింగ్" అనే థీమ్‌తో ఈ నెల 21న నిర్వహించనున్న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కాజులూరు మండల పరిధిలో నమోదైన యోగా ట్రైనర్లకు సోమవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కాజులూరు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె. రాంబాబు పాల్గొని యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ప్రశాంతత లభిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో వృక్షాసనం, తాడాసనం, వజ్రాసనం,భుజంగాసనం వంటి యోగాసనాలతో పాటు ప్రాణాయామ సాధన నిర్వహించారు.మండలంలో ఇప్పటికే 391 మంది యోగా ట్రైనర్లు నమోదు అయ్యారని, వారి ద్వారా పౌరుల నమోదు కార్యక్రమం కూడా చేపట్టినట్లు తెలిపారు. జూన్ 21న జరిగే ప్రధాన యోగా కార్యక్రమం కోసం సుమారు 220 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి 15 వేల మందికి యోగా శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి,మండల పరిషత్ పరిపాలనా అధికారి ఆర్.పద్మలత, ఏపీవో బి.వి.లక్ష్మి, మైథిలి,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# శంకుస్థాపనల హడావుడి.. అసంపూర్తి నిర్మాణాలే మిగిలిన ఎస్సీ పేట






- ప్రజాప్రతినిధుల చిన్నచూపా..?
- అద్దె ఇంట్లో అంగన్వాడీ.. దాహార్తిని తీర్చని వాటర్ ట్యాంక్..

శంకుస్థాపన రాయికే పరిమితమైన డ్రైనేజీ

**పెన్ పవర్, ఆత్రేయపురం జూన్ 15:**రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్న వేళ, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని ఎస్సీ పేటలో మాత్రం అభివృద్ధి అనే పదం శంకుస్థాపనలకే పరిమితమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఘనంగా ప్రారంభోత్సవాలు చేయడం, శిలాఫలకాలు ఆవిష్కరించడం తప్ప పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో విఫలమవుతున్న పరిస్థితి స్థానికులను ఆవేదనకు గురిచేస్తోంది. ప్రారంభించిన ప్రతి అభివృద్ధి పని మధ్యలోనే ఆగిపోవడంతో గ్రామానికి అసంపూర్తి భవనాలు దిష్టిబొమ్మల్లా నిలిచిపోయాయి.

2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో అంగన్వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. అయితే నిర్మాణం పూర్తి కాకముందే పనులు నిలిచిపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నేటికీ అంగన్వాడీ కేంద్రం అద్దె భవనంలోనే కొనసాగుతుండడం అధికార యంత్రాంగ పనితీరుకు అద్దం పడుతోందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

అనంతరం 2019-24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో అవన్నీ గ్రామ నడిబొడ్డున అసంపూర్తి కట్టడాలుగా మిగిలిపోయాయి. ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దాహార్తిని తీర్చని వాటర్ ట్యాంక్

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణం కూడా మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో వేసవి కాలంలో ఎస్సీ పేట ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శాశ్వత పరిష్కారం పేరుతో ప్రారంభించిన పనులు కూడా అసంపూర్తిగానే మిగలడం ప్రజల్లో నిరాశను మిగిల్చింది.

శంకుస్థాపన రాయికే పరిమితమైన డ్రైనేజీ

ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగిస్తామని ప్రకటించిన డ్రైనేజీ ప్రాజెక్టు కూడా శంకుస్థాపన రాయికే పరిమితమైంది. పనులు ప్రారంభం కాకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. సమస్యల పరిష్కారంలో పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారుల నిర్లక్ష్యమా.. ప్రజాప్రతినిధుల చిన్నచూపా..?

ప్రభుత్వాలు మారుతున్నా ఎస్సీ పేట పరిస్థితిలో మార్పు కనిపించకపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపమా..? లేక గ్రామంపై చిన్నచూపా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎస్సీ పేటకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందకపోవడం దురదృష్టకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పూర్తి చేయండి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకురండి

అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ కేంద్రం, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, వాటర్ ట్యాంక్ నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్సీ పేట ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. శంకుస్థాపనలతో ప్రచారం చేసుకోవడం కంటే ప్రారంభించిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## సుపరిపాలనతో సువర్ణాంధ్ర దిశగా కూటమి ప్రభుత్వం





మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 15:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వెంకటాయపాలెంలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన "సుపరిపాలనకు రెండేళ్లు" విజయోత్సవ సభలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధిని సమపాళ్లలో అమలు చేస్తూ సువర్ణాంధ్ర దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందన్నారు.సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని,మహిళలు, రైతులు, మత్స్యకారులు, యువత, ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి రూ.400 కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.తనపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ ప్రజాసేవలో పోటీ పడాలని, నిరాధార ఆరోపణలు చేస్తే తాను వెనుకడుగు వేయనని మంత్రి స్పష్టం చేశారు. గత రెండేళ్లలో వ్యక్తిగతంగా రూ.2.13 కోట్ల ఆర్థిక సహాయం అందించడంతో పాటు సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.7 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు.కార్యక్రమంలో జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీ నాయకుడు కర్రి చిట్టిబాబు, పరిశీలకురాలు మజ్జి పద్మావతి తదితరులు మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. అనంతరం మంత్రి పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి రెండేళ్ల పాలన విజయోత్సవాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు-కిర్లంపూడి ఎంపీపీ తోట రవి.



**కిర్లంపూడి, పెన్ పవర్, జూన్ 15:** ప్రభుత్వ పాఠశాలల విద్యతోనే విద్యార్థులకు మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. సోమవారం కిర్లంపూడి మండలం వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న నూతన పాఠ్యాంశ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా పాల్గొని వీరవరం సొసైటీ అధ్యక్షుడు తోట గాంధీ, వీరవరం టిడిపి అధ్యక్షుడు గొల్లపల్లి సూరిబాబులతో కలిసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట రవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విద్యలో బాగా రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు,ఇద్దరికి జరిమానా.




**-మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు**

**-కిర్లంపూడి ఎస్సై, జి సతీష్ హెచ్చరిక.**

**కిర్లంపూడి,పెన్ పవర్, జూన్ 15:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదురికి జైలు,ఇద్దరికి జరిమానా విధించినట్లు కిర్లంపూడి ఎస్సై,జి సతీష్ తెలిపారు.అయన తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ జిల్లా ఎస్పీ, జి బిందుమాధవ్ ఆదేశాల ప్రకారం పెద్దాపురం డిఎస్పీ,ఎ.బి.జి.తిలక్ ఉత్తర్వుల ప్రకారం, జగ్గంపేట సి.ఐ., బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో తమ సిబ్బందితో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా ప్రతిరోజు కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ తనిఖీల్లో భాగంగా ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ ఏడుగురిని సోమవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా ప్రత్తిపాడు స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె .శారదామణి ఇద్దరికి ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున జరిమానా,నలుగురికి ఐదు జైలు శిక్ష, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై,జి సతీష్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.


## సీనియర్ జర్నలిస్ట్ దేవానందంను పరామర్శించిన మంత్రి వాసంశెట్టి సుభాష్





**రామచంద్రపురం, పెన్ పవర్,జూన్ 15:** గుండెపోటుతో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్ట్ సి.హెచ్. దేవానందంను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ దేవానందం చికిత్సకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.అనంతరం వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, అత్యుత్తమ వైద్యం అందించడంతో పాటు చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు.జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని మంత్రి పేర్కొన్నారు. కష్టకాలంలో ఉన్న జర్నలిస్టులు, వారి కుటుంబాలకు అండగా నిలవడం అందరి బాధ్యత అని అన్నారు. దేవానందం త్వరగా కోలుకుని తిరిగి తన వృత్తి బాధ్యతల్లోకి రావాలని ఆకాంక్షించారు.జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, అవసరమైన సందర్భాల్లో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

## ఏజెంటిక్ ఏఐ పై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం



**గండేపల్లి, పెన్ పవర్, జూన్, 15:**గండేపల్లి మండలం సూరంపాలెం లో ఆదిత్య యూనివర్సిటీ బైట్ ఎక్స్ ఎల్ ఆధ్వర్యంలో "ఎజెంటిక్ ఎ ఐ" అంశంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది అని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం 15వ తేదీ నుండి 19 వ తేదీ వరకు నిర్వహించబడుతుంది అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి. రాజేష్ మరియు ఏ.ఐ.ఎం.ఎల్ విభాగం అధిపతి డాక్టర్ ఎం. వెంకటేష్ పాల్గొన్నారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా మణియార్ ఖాజా మొహియుద్దీన్ వ్యవహరిస్తున్నారు.ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన 60 మంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అధ్యాపకులు "ఎజెంటిక్ ఎ ఐ" అంశంపై ఆధునిక పరిజ్ఞానాన్ని పొందనున్నారు.

